క్లుప్తంగా

ప్రత్యేక పీపీగా బ్రహ్మారెడ్డి నియామకం



గుంటూరు లీగల్: గుంటూరు నాలుగో అదనపు జిల్లా కోర్టులో డెకాయిటీ కేసులు నిర్వహించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బార్ కౌన్సిల్ సభ్యుడు వి.బ్రహ్మరెడ్డిని నియమిస్తూ హోం శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కూడా బ్రహ్మారెడ్డి మూడేళ్లు ప్రత్యేక పీపీగా పని చేశారు. ఆయన నియామకంపై జీబీఏ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి అమరావతి నృత్యోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ అన్నమయ్య కళావేదికగా ఈ నెల 2, 3 తేదీల్లో అమరావతి నృత్యోత్సవం- 2023 నిర్వహిస్తున్నట్లు కె.ఆర్.కె.ఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ కార్యదర్శి కోకా విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కూచిపూడి, మోహిని యాట్టం, పేరని, ఒడిస్సీ నృత్యాలు, ఆదివారం స్వాగత నృత్యం, కథక్, భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారులు పాల్గొని నృత్యోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

లా కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: జేసీ లా కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్‌ను శుక్రవారం కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ విద్యార్థులకు సంబంధించిన విద్య, ఉద్యోగావకాశాల్ని కెరీర్ గైడెన్స్ సెల్ ద్వారా వివరిస్తామని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులైన ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ లీగల్ మేనేజర్ వై. కిరణ్‌కుమార్, కెనరా బ్యాంక్ లా మేనేజర్ కె. శివకేశవ ఆధ్వర్యంలో ప్రస్తుత న్యాయవిద్య అభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులతో ఈ విభాగం కార్యకలాపాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుధాకర బాబు పాల్గొన్నారు.

నారాకోడూరులో క్రికెటర్ అంబటి రాయుడు పర్యటన

చేబ్రోలు: చేబ్రోలు మండలం గొడవర్రు, నారా కోడూరు గ్రామాల్లో క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు శుక్రవారం పర్యటించారు. గొడవర్రు శివాలయం, మసీదు, చర్చిలో స్థానికులతో కలిసి ప్రార్థనలు చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు.

షెడ్యూల్ ప్రకారం తాగునీటి సరఫరాకు చర్యలు

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్ లీకు మరమ్మతు పనుల్ని వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. షెడ్యూల్ మేరకు శనివారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద జరుగుతున్న పైప్‌లైన్ లీకు మరమ్మతు పనుల్ని ఆమె తనిఖీ చేశారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనుల వేగవంతం, నాణ్యత ప్రమాణాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఈఈలు దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని ఆదేశించారు. లీకు మరమ్మతు పనుల వల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, నగరపాలక సంస్థ కాల్ సెంటర్‌కి కూడా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాలకు తాగునీటి ట్యాంకర్లను పంపేలా ఏఈలు చర్యలు తీసుకోవాలని కమిషనర్ చెప్పారు. ఆమె వెంట ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, డీఈఈ. శ్రీనివాసరెడ్డి, ఏఈ. అనూష, ఎమినిటీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రజా ప్రతినిధుల అర్జీలకు తక్షణ పరిష్కారం

ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తన చాంబర్‌లో శుక్రవారం కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు.

నేటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా

నెహ్రూనగర్: స్థానిక వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం(హెచ్ఎల్ఆర్) వాటర్ ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌పై ఏర్పడిన లీకుల్ని ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం రాత్రికి పూర్తి చేయడంతో శనివారం యథావిధిగా తాగునీటి సరఫరా చేయనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ సమయం కన్నా ముందే లీకులకు మరమ్మతులు చేసిన ఇంజినీరింగ్ అధికారుల్ని కమిషనర్ అభినందించారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమ విప్లవం



కొత్తగా పింఛన్ మంజూరైన వారితో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ

నెహ్రూనగర్: సీఎం వై.ఎస్. జగన్ పాలనలో అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ముఖ్యంగా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ఆరు నెలలకొకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ పండుటాకు మోముల్లో చిరునవ్వును చిందిస్తున్నారని 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ తెలిపారు. డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన 34 పెన్షన్లను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కనకదుర్గ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ రూ. 2వేలు మాత్రమే ఉండేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మూడు వేల దాకా పెంచుకుంటూ పోతానని చెప్పిన సీఎం జగన్ మాట ప్రకారం అమలు చేసే దిశగా పయనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత మార్కెట్ శ్రీను, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

సంస్కృత భాష వేద విజ్ఞాన నిధి



విద్యార్థులతో ఉపద్రష్ట వేంకట రమణమూర్తి, మనోహర్, కేవీ బ్రహ్మం, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కృత భాష వేద విజ్ఞాన నిధి వంటిదని విజయవాడలోని ఎస్ఆర్ఆర్-సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ఉపద్రష్ట వేంకట రమణమూర్తి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో శుక్రవారం సంస్కృత విభాగం-సంస్కృత భారతి సంయుక్తంగా సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణమూర్తి మాట్లాడుతూ పాశ్చాత్య వ్యామోహంతో మన చరిత్రను, మన సంస్కృత భాషను మరిచిపోయామని తెలిపారు. మనది వేల సంవత్సరాల చరిత్ర అని చెప్పేందుకు శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయని వివరించారు. నాటి గురుకుల విద్యలో మూడు వేల సంవత్సరాల కిందట 10,500 మంది విద్యార్థులు, 68 రకాల కోర్సులతో నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు విలసిల్లాయని గుర్తు చేశారు. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానానికి భారతదేశం పుట్టినిల్లువంటిదని పేర్కొన్నారు. సుశ్రుత వంటి వారు వెంట్రుకను సైతం నిలువుగా రెండు ముక్కలుగా చీల్చిన పరిజ్ఞానం కలిగిన వైద్య విద్యకు మూలకేంద్రం అని వెల్లడించారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అహింసా పరమో ధర్మః, సత్యమేవ జయతే, ధర్మో రక్షతి రక్షితః వంటి మానవతావాదానికి భారతదేశం నిలయమని వివరించారు. భారతీయ జీవన మార్గాన్ని తీర్చిదిద్దే విజ్ఞానమంతా భాషలోనే ఉందని, వసుధైక కుటుంబమనే భావనను నేర్పేది సంస్కృత భాష అని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ మన భారతీయ భాషల్లో 70 శాతం సంస్కృత పదాలున్నాయన్నారు. సంస్కృతంలో ప్రావీణ్యం సాధిస్తే ప్రాంతీయ భాషపై పట్టు సాధించవచ్చని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ దేశంలో సంస్కృతం మాట్లాడే గ్రామాలు ఎనిమిది ఉన్నాయని, ఆ భాషలోని విజ్ఞానాన్ని అందుకుంటే దేశం అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సంస్కృత భాషపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళీధర్, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్రగుప్త, అధ్యాపకులు డాక్టర్ ఏ.అంజనీకుమార్, జయశైలజ, డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, శ్రావణి, షేక్ నాగరాణి, పి. నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు



అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారు



శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో...

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో సువాసినులు డప్పు వాయిద్యాలతో ఆలయానికి చేరుకుని, అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంకా విజయబాబు దంపతులు, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, వూటుకూరి నాగేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. పూజల్ని ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి, కృష్ణ, చిన్మయ నిర్వహించారు.

=అరండల్‌పేటలోని గంగామీనాక్షి సమేత శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారికి లక్ష విరజాజుల పూజను నిర్వహించారు. సువాసినులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

== శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. శ్రీ లలిత సహస్రనామ, కోటి కుంకుమార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నేడు పలు సేవా కార్యక్రమాలు

పట్నంబజారు: దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని శనివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. బి.ఆర్.స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో మెగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ 14వ వర్ధంతిని పురస్కరించుకుని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంజుమన్ పాఠశాలలో మహిళల కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. విద్యా, వైద్యం పేదలకు చేరువ కావాలని మహానేత వైఎస్సార్ కృషి చేశారని కీర్తించారు. ఫీజు రీయింబర్స్ వంటి గొప్ప పథకాన్ని తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని కొనియాడారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు ఎలుకల మందు తిని, ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పాతరెడ్డిపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. పి.జాన్ అనే యువకుడు కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఎలుకల మందు తినడంతో.. కుటుంబ సభ్యులు అతనిని 108 అంబులెన్స్‌లో తెనాలి పభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

కానిస్టేబుల్ కొట్టడంతో ఎలుక మందు తిన్న బాధితుడు

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైనం
- విచారణ చేపట్టిన అధికారులు

పట్నంబజారు: అతను లాలాపేట పీఎస్‌లో కానిస్టేబుల్.. నోటి దురుసుతో పాటు చేతి దురుసు అధికమే.. ఆ దురుసు ప్రవర్తనే ఒక వ్యక్తి ప్రాణం మీదకు తీసుకువచ్చింది. వివరాల్లోకి వెళితే.. సంగడిగుంట ప్రాంతానికి చెందిన సలాం బుడంపాడు రోడ్డులోని వెంకటకృష్ణ వద్ద చికెన్ పకోడి తింటుంటాడు. ఈ నేపథ్యంలో రూ. 500పైగా బాకీపడ్డాడు. దీనితో ఇద్దరి మధ్యా వివాదం జరడంతో సలాం, వెంకటకృష్ణను కొట్టాడు. బాధితుడు లాలాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో విచారణ నేపథ్యంలో స్టేషన్‌కు వచ్చిన సలాంను రత్నరాజు (స్టేషన్‌లో పిలిచే పేరు కియా) ఇష్టానుసారంగా కొట్టి ఇబ్బందులకు గురి చేశాడు. కుటుంబ సభ్యుల ముందే ఇష్టానుసారంగా దుర్భాషలాడినట్లు బాధితుడు అధికారులకు చెప్పినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన సలాం, కానిస్టేబుల్ కియా తీరుతో ఎలుక మందు తిన్నాడు. తీవ్ర అస్వస్థతకు గురి కావటంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ రత్నరాజుపై గతంలో కూడా అనేక ఫిర్యాదులు అధికారులకు అందాయి. గతంలో పదో తరగతి పరీక్షలు జరిగిన సమయంలో కూడా హిందూ కళాశాల వద్ద ఒక విద్యార్థిని తల్లిని అమర్యాదగా మాట్లాడిన పరిస్థితులు ఉన్నాయి. తాను కరాటే ఫైటర్‌ని అని.. తాను కిక్ ఇస్తే మామూలుగా ఉండదంటూ.. నిత్యం స్టేషన్‌కు వచ్చే బాధితులను కొట్టడం పరిపాటేనని స్టేషన్ సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎం సుబ్బారావు చెప్పారు. కానిస్టేబుల్ రత్నరాజు తప్పు ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

వైభవంగా పుష్ప యాగం



పుష్ప యాగంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: ఆర్.అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో దుర్గారావు, నేరెళ్ల హరి ప్రసాదరావు, నేరెళ్ల వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

==ఏటీ అగ్రహారంలోని కంచికామకోటి పీఠ శ్రీ శంకర గాయత్రీ మందిరంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ సారెను భక్తులు అమ్మవారికి సమర్పించారు. భక్తిశ్రద్ధలతో సామూహిక లలితా పారాయణ జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కార్యదర్శి పి.భావన్నారాయణ, కోశాధికారి సాయి భాస్కర్, సహాయ కార్యదర్శి గంగిశెట్టి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు మంగళగిరి.
OS No. 427/2019

బిట్వీన్
షేక్ ఫిరోజ్ సుల్తానా... ప్లయింటిఫ్
షేక్ జైనులాబ్దిన్&అదర్స్.. డిఫెండెంట్స్
&
టు. షేక్ రఫి ..జాన్ మొహమ్మద్ గుంటూరు

పై నంబరు దావా రెండవ డిఫెండెంట్ అయిన మీ పై పార్టిషన్ కొరకు వేసియున్నారు. సదరు OS No. 427/2019 లో రెండవ డిఫెండెంట్ అయిన మీకు కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం అనేక పర్యాయములు నోటీసులు జారిచేసినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పేపర్ ప్రకటన ద్వారా మీకుది.11.09.2023న వాయిదా ఇచ్చి యున్నారు. సదరు వాయిదాకు మీరు గాని మీ లాయర్‌గారి ద్వారా గాని కోర్టుకు హాజరు అయి మీకు గల అక్షేపణలు తెలువు కోవలసినది లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడం జరిగింది.
వాయిదా : 11.09.2023

అబ్దుల్ గఫ్ఫార్, అడ్వకేట్, మంగళగిరి

వెన్నుదన్నును కాపాడుకుందాం

గుంటూరుకు చెందిన శ్రీరామ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ విధి నిర్వహణలో భాగంగా ప్రతిరోజూ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుంటాడు. ఇటీవల వెన్ను నొప్పి రావడంతో వైద్యుల్ని సంప్రదించాడు. దీర్ఘకాలికంగా ప్రయాణాలు చేస్తుండటం వల్ల వెన్నుముక సమస్య ఉత్పన్నమవుతున్నట్లు వైద్యులు గుర్తించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు.



- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న సమస్యలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో ఉచితంగా శస్త్ర చికిత్సలు

వెన్ను సమస్యలకు కారణాలు

- ఎక్కువసేపు కంప్యూటర్ల ముందు కూర్చుని పని చేయడం
- స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తూ ఎక్కువసేపు ఒకేచోట కూర్చుండి పోవడం
- కార్లు, ద్విచక్ర వాహనాలపై ఎక్కువ దూరాలు ప్రయాణాలు చేయడం
- ఊబకాయం
- శారీరక శ్రమలేకపోవడం
- జీవనశైలిలో మార్పులు
- ధూమపానం
- గుంతలు ఉన్న రోడ్లపై వాహనాలు నడపడం
- ఒత్తిడితో కూడిన జీవనం

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల వెన్నుముక సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉద్యోగస్తులు, ముఖ్యంగా కంప్యూటర్లపై ఎక్కువగా పనిచేస్తున్నవారు, విద్యార్థులు, యువత సైతం తరగతి గదుల్లో ఎక్కువ సేపు కూర్చోలేక సమస్య బారిన పడుతున్నారు. వెన్ను సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా నయం చేయవచ్చు. అయితే, ఆపరేషన్లు, వైద్య విధానాల గురించి ప్రజల్లో అనేక అపోహలు ఉండటం, అవగాహన లేకపోవడంతో సమస్యల్ని పెద్దవి చేసుకుని చివరి దశలో వైద్యుల్ని సంప్రదిస్తున్నారు.

వెన్నుముక కీలకం

ఎముకలన్నింటిలో ముఖ్యమైంది వెన్నుముక. వెన్నుపాముకు రక్షణ కల్పిస్తుంది. వెన్నుముక నుంచే నరాలు బయటకు వస్తాయి. మనం నిటారుగా నిలబడటానికి, పక్కకు, వెనుకకు, ముందుకు తిరగడానికి, ఎటు కావాలంటే అటు వంగడానికి ఉపయోగపడుతోంది. శరీరం మొత్తాన్ని నిటారుగా నిలబెడుతోంది. వెన్నుపూసలు ఒకదానికొకటి క్రమపద్ధతిలో అమరి వెన్నుముకను ఏర్పరుస్తాయి. కండరాలు లిగమెంట్లతో నిర్మాణం ఉంటుంది. కండరాలు, లిగమెంట్లు ఆరోగ్యంగా రెండువైపులా ఒకే రకమైన బిగువుతో ఉంటే వెన్నుపూస దాని స్థానంలో నిలిచి ఉంటుంది. వెన్నుపూసలు వాటి స్థానంలో సక్రమంగా నిలిచి ఉండాలంటే పటుత్వం బాగుండాలి. కండరాలకు, వెన్నుపూస ఎముకల మధ్య సమతూకం దెబ్బతింటే నడుము నొప్పివస్తుంది.

ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒకరోజు వెన్నునొప్పితో బాధపడటం మామూలే.

బాధితులు అధికమే...

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 300 మంది ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 60మంది వెన్నుముక సంబంధిత సమస్యలతో బాధపడేవారే. జిల్లాలో 200 మంది ఆర్థోపెడిక్ సర్జన్స్ ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 10 మంది వరకు వెన్నుముక సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు.

సహజ అరుగుదల ఉంటుంది

సాధారణంగా వయస్సు పెరిగే కొద్ది వెన్నుపూస మధ్యలో ఉండే డిస్కులు అరిగి గ్యాప్ ఏర్పడుతోంది. అక్కడ కొత్తగా కండరం పెరగడం, లేదా ఎముక పెరగడం జరిగి నడుము నొప్పి, తుంటి నొప్పి, కాలుజాలు, కాలు తిమ్మిరి, కాలు పటుత్వం తగ్గిపోవడం, మలమూత్రాలను ఆపుకోలేక నియంత్రణ కోల్పోవడం జరుగుతుంది. డిస్క్ జారినప్పుడు గజ్జల్లో నొప్పి, తొంటి నొప్పి వస్తుంది. కాళ్లలో స్పర్శ తగ్గిపోతుంది. వెన్నుపూస ఆకారం మారిపోతోంది.

90శాతం అవే తగ్గిపోతాయి

వెన్నుముకలో డిస్క్ సమస్యలు వచ్చిన మొదటి సారి నూటికి 90 శాతం అవే తగ్గిపోతాయి. తొలిసారి సమస్య వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. 48 గంటలపాటు నడుముకు విశ్రాంతి ఇస్తే నొప్పి తగ్గుతోంది. వేడినీళ్ళు కాపడం, ఫిజియోథెరఫీ, నొప్పి నివారణ మాత్రలు కొద్దిపాటి వ్యాయామం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. రెండో సారి సమస్య వస్తే 50శాతం ఎలాంటి వైద్యం చేయకుండానే తగ్గిపోతాయి. మొండిగా సమస్య ఉన్నవారికి తుంటికి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. మూడోసారి మరలా డిస్క్ సమస్య వస్తే 20 శాతం మాత్రమే వాటంతట అవి తగ్గుతాయి. వీటికి తప్పనిసరిగా వైద్యం చేయాల్సి ఉంటుంది. కీ హోల్ సర్జరీ ద్వారా ఎముక, కండ కట్ చేయకుండా చిన్న రంధ్రం ద్వారా జరిగిన ఎముకను సరిచేసి నొప్పిని నివారించవచ్చు.

ఇవన్నీ అపోహలే ..

వెన్నుముక సర్జరీలు సురక్షితం కాదనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేసే సమయంలో నరాలు దెబ్బతింటే జీవితాంతం నడక ఉండదని భావిస్తారు. ఒకసారి సర్జరీ చేస్తే మరలా మరలా చేయాల్సి వస్తుందనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేయించుకున్నవారు వంగకూడదు, బరువు ఎత్తకూడదు, జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు భావిస్తారు. ఇవన్నీ అపోహలు మాత్రమే.

ఆధునిక శస్త్రచికిత్సలు



వెన్నుముక శస్త్రచికిత్సల్లో అత్యాధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ నేవిగేషన్, న్యూరోమానిటరింగ్, మైక్రోస్కోప్ ఆపరేషన్లతో సమస్యలను చాలా సులువుగా నయం చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డిస్క్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, బరువు నియంత్రణలో పెట్టుకోవడం, కూర్చుని పనిచేసే వారు ప్రతి రెండు గంటలకు ఒకసారి లేచి నడవడం చేయాలి. ఎక్కువసేపు ఒంగి పనులు చేయరాదు. అధిక బరువులు ఎత్తకుండా ఉండటం ద్వారా వెన్ను సమస్యలు దరి చేరవు.

– డాక్టర్ జె. నరేష్‌బాబు,
స్పయిన్ సర్జన్,గుంటూరు

గ్రంథాలయ సెస్ బకాయిలు విడుదల చేయాలి



కమిషనర్ కీర్తిని సత్కరిస్తున్న దేవానంద్

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రావాల్సిన సెస్ బకాయిల్ని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో కలసి సెస్ బకాయిల విషయమై ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు దేవానంద్ తెలిపారు. కమిషనర్‌ను కలసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి ఉన్నారు.

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నెహ్రూనగర్: పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోరంట్లలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా, ఆ దిశగా బీజేపీ అడుగులు వేయడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రస్తావించడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని గుర్తు చేశారు. బీజేపీ వర్గీకరణ బిల్లు పెట్టకపోతే ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రైవేటు బిల్లు పెట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఆయన కోరారు.

వీవీఐటీలో భారత బ్లాక్ చెయిన్ యాత్ర

పెదకాకాని: ఇన్‌ఫర్మేషన్ డేటా సిస్టమ్స్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రోత్సాహంతో భారత్ బ్లాక్ చెయిన్ యాత్ర 4వ ఈవెంట్‌ను వీవీఐటీలో నిర్వహించారు. శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ కరెన్సీ, ఐడీ, ఓటింగ్, డేటా షేరింగ్ వంటి సాంకేతిక అంశాల పరిరక్షణ కొరకు వినియోగించే బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై అపోహలు తొలగించి, సాంకేతిక విలువలను పెంపొందించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. ఈ యాత్రలో ముఖ్య అతిథులుగా భారత బ్లాక్ చెయిన్ యాత్ర కన్వీనర్ అరవింగ్ ఓరుగంటి, ఐడీఎస్ బిజినెస్ హెడ్ సునీల్ యడవల్లి పాల్గొన్నారు.